సాక్షి
నిజామాబాద్

గురువారం । 23 । మార్చి । 2023



రసవత్తరంగా కుస్తీ పోటీలు
ఉగాది సందర్భంగా పలు గ్రామాల్లో నిర్వహించిన కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగాయి.
- 8లో ▸



రైతుల పాలిట వరం కేవీకే
వాతావరణంపై అధ్యయనం చేసి సూచనలిస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం రైతుల పాలిట వరంగా మారింది.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.4 /21.4

వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతం అయ్యే అవకాశం ఉంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది.



డిచ్‌పల్లి ఖిల్లా గ్రామంలో ఉగాది పండుగ సందర్భంగా ఎడ్ల బండ్ల ఊరేగింపు

సంబురంగా ఉగాది

తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను బుధవారం జిల్లా ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. నూతన తెలుగు సంవత్సరంలో కొత్త ఆశలు చిగురించాలని కోరుకుంటూ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయాల్లో పంచాంగ శ్రవణం నిర్వహించారు. పలు గ్రామాల్లో ఆలయాల చుట్టూ ఎడ్ల బండ్లను తిప్పారు. ఎడ్లబండ్ల ప్రదర్శనను తిలకించేందుకు ప్రజలు తరలి వచ్చారు.

న్యూస్‌రీల్

నిఖత్ జరీన్‌కు పతకం ఖాయం



నిజామాబాద్‌నాగారం: ప్రత్యర్థులను తన పంచులతో మట్టికరిపిస్తూ.. వరుస విజయాలతో దూసుకెళ్తున్న నిఖత్‌కు పతకం ఖాయం అయింది. ఉమెన్ వరల్డ్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో నిఖత్‌జరీన్ హవా కొనసాగుతోంది. బుధవారం ఢిల్లీలో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో థాయిలాండ్‌కు చెందిన బాక్సర్‌పై నిఖత్ 5–2 తేడాతో గెలిచి సెమీస్‌కు చేరింది. గురువారం సెమీస్‌లో కొలంబియకు చెందిన ఇంగ్రితతో పోటీ పడనుంది.

పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి



ధర్పల్లి(ఇందల్వాయి): పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద నరేష్ మాదిగ డిమాండ్ చేశారు. గోవింద నరేష్ ఆధ్వర్యంలో చేపట్టిన మాదిగల సంగ్రామ యాత్ర బుధవారం ఇందల్వాయి మండలం తిర్మన్‌పల్లి గ్రామానికి చేరుకుంది. ఈ యాత్రకు జిల్లా కన్వీనర్ కనుక ప్రమోద్ మాదిగ ఆధ్వర్యంలో మాదిగ కులస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో గోవింద నరేష్ మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ లేక విద్య, ఉద్యోగ రంగాల్లో మాదిగలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతపై బీజేపీ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 4న నిర్వహిస్తున్న హైదరాబాద్ ముట్టడికి తరలి రావాలని కోరారు. నాయకులు భూమన్న మాదిగ, రొడ్డ ప్రవీణ్, బాలు యాదవ్, శ్రీకాంత్, మహిపాల్, అభిలాష్, మహేందర్ పాల్గొన్నారు.

పదోన్నతిపై హోంగార్డ్ ఏసీపీ బదిలీ

ఖలీల్‌వాడి: నిజామాబాద్ హోంగార్డ్ ఏసీపీగా పనిచేస్తున్న శ్రీనివాస్ పదోన్నతిపై జయశంకర్ భూపాలపల్లి హోంగార్డు ఏఏసీపీగా వెళ్లనున్నారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులు మంగళవారం వెలువడ్డాయి. రెండు రోజుల్లో జయశంకర్ భూపాలపల్లిలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిసింది.

ఎడపల్లి పీహెచ్‌సీ పరిశీలన



ఎడపల్లి: ఎడపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం కేంద్ర ప్రత్యేక బృందం సభ్యులు డాక్టర్లు సీమా మురళి, శాలిని చావ్లా పరిశీలించారు. ఈ ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలు, హాస్పిటల్‌లో ఉన్న సౌకర్యాలను తనిఖీ చేశారు. ప్రత్యేక బృందం సభ్యులు గురువారం కూడా పరిశీలించనున్నట్లు తెలుస్తోంది.

పద్దెనిమిది కుటుంబాల 'బలగం'!



సాక్షి, కామారెడ్డి: ఉద్యోగ రీత్యా వాళ్లంతా వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఇళ్లు కట్టుకుని మూడు, నాలుగు దశాబ్దాలుగా కలిసిమెలసి జీవిస్తున్నారు. దాదాపు అందరూ ఉద్యోగులే. కొందరు రిటైర్డ్ కూడా అయ్యారు. పిల్లలు పెద్దవాళ్లయ్యారు. పెళ్లిళ్లు చేశారు. 18 కుటుంబాలు ఒకే కుటుంబం అన్నట్టుగా కలిసిమెలిసి ఉంటాయి. కామారెడ్డిలోని ఎన్జీవోస్ కాలనీకి చెందిన ఈ పద్దెనిమిది కుటుంబాల వాళ్లు శ్రీ సీతారామాంజనేయ సొసైటీని ఏర్పాటు చేసుకుని సేవా కార్యక్రమాలు చేస్తుంటారు. ఇటీవల విడుదలైన 'బలగం' సినిమా గురించి టీవీ చానళ్లు, పత్రికల్లో చూసిన తర్వాత అందరు కలిసి సినిమా చూడాలనుకున్నారు. అంతే మంగళవారం రాత్రి అందరూ కలిసి సినిమాకు వెళ్లి వచ్చారు.

ఎల్‌ఆర్‌ఎస్‌కు తూట్లు

- మున్సిపల్ లైసెన్స్ సర్వేయర్ల చేతివాటం
- నకిలీ రూ. 1000 ఫీజు పత్రాలు సృష్టించి వాటితో చెల్లింపులు
- నిబంధనలకు విరుద్ధంగా ఒకే నంబర్‌పై వందల్లో దరఖాస్తులు
- లైసెన్సు సర్వేయర్లు, టౌన్‌ప్లానింగ్ అధికారుల కుమ్మక్కు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఎల్‌ఆర్‌ఎస్ అభాసుపాలవుతోంది. అర్హులకు దక్కాల్సిన ఈ స్కీంను బల్దియాకు చెందిన లైసెన్స్ సర్వేయర్లు పూర్తిగా పక్కదారి పట్టించారు. లబ్ధిదారులను బోల్తా కొట్టించి లైసెన్స్ ఫీజు రూపంలో ఎక్కువ వసూలు చేస్తున్నారు. బల్దియాకు మాత్రం తక్కువ మొత్తంలో ఫీజులు కడుతున్నారు. ఎల్‌ఆర్‌ఎస్‌కు సంబంధించిన నకిలీ ధ్రువపత్రాలను తయారు చేస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ఫలితంగా బల్దియాకు ఆదాయం కోల్పోయేలా చేస్తున్నారు.



నిజామాబాద్‌నాగారం : నగరంలోని దుబ్బ ప్రాంతంలోని గుర్బాబాదిరోడ్‌లోని గుమాస్తా సంఘం వెంచర్లలో ఓ వ్యక్తి తన 235 గజాల స్థలంలో ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్నాడు. అయితే ఆయన మున్సిపాలిటీ టీఎస్‌బీపాస్ ద్వారా సుమారు రూ. 3,77,000 ఫీజు కట్టాలి. ఎల్‌ఆర్‌ఎస్ కింద ఆయన గతంలో దరఖాస్తు చేసుకోలేదు కాబట్టి ఈ ఫీజు కట్టాల్సి ఉంటుంది. ఇక్కడే లైసెన్స్ సర్వేయర్ రంగంలోకి దిగాడు. సదరు సర్వేయర్ తన ఫోన్ నంబర్‌తో నకిలీ రూ. 1000 ఎల్‌ఆర్‌ఎస్ పత్రాన్ని ఆన్‌లైన్‌లో సమర్పించి ఈ ఫీజును తగ్గిస్తానని దరఖాస్తుదారుడితో మాట్లాడుకుని రూ. 2,50,000 తీసుకున్నారు. ఇందులో నుంచి రూ. 60 వేలు తాను జేబులో వేసుకుని బల్దియాకు మాత్రం రూ. 1,90,000 కట్టాడు. మొత్తంగా బల్దియాకు రూ. 3,77,000 ఫీజుకు గాను కేవలం బల్దియాకు రూ. 1,90,000 మాత్రమే కట్టారు. లైసెన్స్ ఫీజు తక్కువ చేయించేందుకు ఇలా సర్వేయర్లు, టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది కలిసి అడ్డదార్లు తొక్కుతున్నారు.

స్కీం వివరాలివి..

రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ స్కీం 2018లో తీసుకొచ్చింది. నాన్ లేఅవుట్ ప్లాట్లకు రెగ్యులరైజ్ చేసుకునేందుకు రూ. వెయ్యి ఫీజులో అవకాశం ఇవ్వడంతో ఆర్నెళ్లల్లో 25వేల వరకు దరఖాస్తులు బల్దియాకు వచ్చాయి. ఈ ఫీజు చెల్లించిన వారికి ఇంటి నిర్మాణానికి పాత డాక్యుమెంట్ వాల్యూ ప్రకారం మున్సిపాలిటీ ఫీజు 14శాతం తగ్గుతుంది. ఒకవేళ రూ. 1000 ఫీజు చెల్లించని నాన్ లేఅవుట్‌లో ప్లాట్లకు కచ్చితంగా పెరిగిన మార్కెట్ వాల్యూ ప్రకారం 14 శాతం అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.

ఒకే నంబర్‌పై వందల్లో దరఖాస్తులు

2021 నుంచి ఇప్పటి వరకు నగరంలోని కొంతమంది లైసెన్సు సర్వేయర్లు అక్రమాలకు తెరలేపారు. నిబంధనల ప్రకారం ఇళ్లు నిర్మించుకునే వ్యక్తి ఫోన్ నంబర్‌తో దరఖాస్తులు చేయాలి. కానీ మున్సిపల్ లైసెన్స్ సర్వేయర్లు తమ ఫోన్ నంబర్లపైనే వందల్లో దరఖాస్తులను అప్లయ్ చేస్తున్నారు. ఎల్‌ఆర్‌ఎస్‌లో ఉన్న లొసుగులను ఆసరాగా చేసుకుని అక్రమాలకు పాల్పడుతున్నారు. కొంతమంది లైసెన్సు సర్వేయర్లు తమకు సంబంధించిన ఒకే ఫోన్ నంబర్‌పై వందలాది దరఖాస్తులు చేశారు. అందులో కొన్ని ఫోన్ నంబర్లు ఇలా.. 9000005960, 9848940487, 9490199217, 9542814300, 9666314145 ఉన్నాయి.

లొసుగులతో చెలగాటం..

నిజామాబాద్ మున్సిపాలిటీ పరిధిలో లైసెన్సు సర్వేయర్లు సుమారు 60మంది వరకు ఉంటారు. ఇంటి నిర్మాణానికి సంబంధించి అనుమతులు కావాలంటే కచ్చితంగా లైసెన్సు సర్వేయర్లు నిబంధనల ప్రకారం ప్లానింగ్ వేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తుతో పాటు ప్లానింగ్ సమర్పించాలి. అయితే కొంతమంది కాసులకు కక్కుర్తి మున్సిపల్‌కు వచ్చే ఆదయానికి గండి కొడుతున్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులకు కూడా వీరికి చేతులు కలుపుతున్నారు. జీవో నం. 168ను తుంగలో తొక్కి నిబంధనలకు విరద్ధంగా అనుమతులు ఇస్తూ ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తున్నారు.

ఆదాయం పెంపే లక్ష్యంగా..

- ఆర్టీసీ వంద రోజుల టార్గెట్
- నేటి నుంచి జూన్ 30 వరకు అమలు
- అన్ని బస్సులను వినియోగించుకోవాలని నిర్ణయం
- ఉమ్మడి జిల్లాలో నిత్యం 2.32 లక్షల కిలోమీటర్లు తిరిగేలా చర్యలు



ఖలీల్‌వాడి: ఆర్టీసీ ఆదాయం పెంపే లక్ష్యంగా మరో ప్రయత్నం ప్రారంభించింది. వంద రోజుల పాటు ఆర్టీసీలోని స్పేర్ బస్సులు సహా మొత్తం బస్సులను రోడ్డెక్కించడంతో పాటు ప్రత్యేకంగా మార్పులు చేర్పులు చేసి, ఆదాయం పొందేందుకు కసరత్తు చేస్తుంది. దీనికి రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ 'టార్గెట్ 100 డేస్'గా పేరు పెట్టింది. మార్చి 23 నుంచి జూన్ 30 వరకు దీనిని కొనసాగించాలని ఇప్పటికే నిజామాబాద్ ఆర్టీసీ అధికారులకు ఆదేశాలు అందాయి. ఈ వంద రోజుల్లో ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు, డ్రైవర్లు అత్యవసరం అయితే తప్ప సెలవులు పెట్టారదని ఆదేశాలు ఉన్నట్లు తెలిసింది. వారంతపు సెలవులో ఆర్టీసీ సిబ్బంది పరిరక్షణ బృందాలుగా ఏర్పడి రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతంలో ఎక్కువ మందిని ఆర్టీసీ బస్సులెక్కేలా చూడాలని ప్రత్యేక ఆదేశాలను అధికారులు జారీ చేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ఆరు డిపోలకు పరిధిలోని 615 బస్సులు ప్రతిరోజు 2.32 లక్షల కిలోమీటర్ల తిరగాలని టార్గెట్‌గా నిర్ణయించారు. ప్రతి కిలోమీటర్‌కు రూ.41.7 వచ్చేలా చూడాలని అధికారులు ఆదేశించినట్లు సమాచారం. గత వేసవిలో ప్రయోగాత్మకంగా వంద రోజుల ఛాలెంజ్‌ను అములు చేయగా అప్పట్లో గతంలో కంటే ఎక్కువగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఆదాయం సమకూరింది. అంతేకాకుండా గత డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలలో ఆల్ డిపో ప్రాఫిట్ ఛాలెంజ్‌తో కార్యక్రమం నిర్వహించగా నిజామాబాద్–1 డిపో ఉత్తమ డిపో అవార్డు రాష్ట్రస్థాయిలో గెలుచుకుంది. దీంతోపాటు మిగతా ఐదు డిపోల్లో కూడా ఆదాయం పెరిగింది.

ఇవీ ఆదేశాలు..

- ప్రతి బస్సులో కనీసం నలుగురు నుంచి ఆరుగురు అదనంగా ఎక్కేలా డ్రైవర్, కండక్టర్ చూడాలి.
- ప్రయాణికులు ఎక్కువగా ఉన్న చోట రెండు నిమిషాల పాటు అదనంగా ఆపి వారిని ఎక్కించుకొవాలి.
- వేసవిలో మధ్యాహ్నం పూట బస్సులను తగ్గించి రాత్రివేళ్లలో సర్వీసులను పెంచాలి.
- రాత్రి వేళ ప్రయాణికులు ఎక్కువగా ఉండే ప్రాంతాలకు అవసరం అయితే మూడో షిప్టు పంపాలి.
- అద్దె బస్సులను కూడా అదనపు ట్రిప్పులకు ఉపయోగించుకోవాలి.
- పరీక్షలు పూర్తయ్యాక గ్రామాలకు తిప్పే బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో తక్కువగా ఉండే వాటిని గుర్తించి వాటిని రద్దీ ఎక్కువ ఉండే ప్రాంతాలకు మళ్లించాలి
- డిమాండ్ ఎక్కువగా ఉండే రోజుల్లో టార్గెట్‌ను మించి కిలోమీటర్లు తిరగాలి. ఒకటి, రెండు పాయింట్లలో గ్రౌండ్ బుకింగ్ కోసం కండక్టర్లను పెట్టి, కండక్టర్ సర్వీస్ లేని బస్సులను ఎక్కువగా తిప్పాలి.
- నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికులను తరలించే ప్రైవేట్ వాహనాలపై చర్యలు చేపట్టడానికి రవాణా, పోలీసు అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి.

ఉర్దూ బోధన బాగయ్యేనా!

- ఉర్దూ మీడియం పాఠశాలల్లో సమస్యల తిష్ట
- 'పది' ఫలితాలపై ప్రభావం పడే అవకాశం



కోజా కాలనీలో ఉర్దూ మీడియం పాఠశాల

నిజామాబాద్‌అర్బన్: పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా అధికారులు ప్రణాళికలు చేస్తున్నారు. కానీ ఉర్దూ మీడియం పాఠశాలల్లో మాత్రం ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులకు బోధన సక్రమంగా సాగడం లేదు. బడుల్లో సమస్యలు తిష్ట వేశాయి. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో ప్రతి ఏటా ఉర్దూ మీడియంలో విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది. కానీ దానికి తగినట్లుగా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టడం లేదు. దీంతో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న చోట బోధన నామమాత్రంగా సాగుతోందని విమర్శలు ఉన్నాయి.

ఖాళీగా టీచర్ పోస్టులు

జిల్లాలో 178 ఉర్దూ మీడియం బడులు ఉన్నాయి. 21,172 మంది చదువుకుంటున్నారు. పదో తరగతి ఉన్న పాఠశాలలు పది ఉన్నాయి. ఇందులో 486 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. మొత్తం పాఠశాలల్లో 649 ఉపాధ్యాయ పోస్టులుండగా 481 మంది టీచర్లు మాత్రమే ఉన్నారు. నగరంలోని నిజాం కాలనీలో ఉర్దూ మీడియం పాఠశాలలో 302 మంది విద్యార్థులకు ముగ్గురు టీచర్లు మాత్రమే ఉన్నారు. నసీంకాలనీలో 68 మందికి ఒక్కరే ఉపాధ్యాయుడు ఉన్నారు. వెంగళ్‌రావ్‌నగర్ కాలనీలో ఉర్దూ పాఠశాలలో 401 మంది విద్యార్థులకు నలుగురు టీచర్లు మాత్రమే పాఠాలు చెబుతున్నారు. ఇలా చాలా బడుల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేక ఇబ్బంది అవుతోంది. దీంతో విద్యా బోధన ప్రణాళిక ప్రకారం జరగడం లేదు. మరోవైపు విద్య వలంటీర్ల నియామకానికి అనుమతి లేక పోవడంతో బోధన అస్తవ్యస్తంగా మారింది. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు కూడా నామమాత్రంగానే సాగుతున్నాయి.

డిప్యుటేషన్లపై అనాసక్తి

ఎక్కువ మంది టీచర్లు ఉన్న బడుల నుంచి తక్కువ ఉన్న పాఠశాలలకు పలువురిని డిప్యుటేషన్లపై పంపినా ఉపాధ్యాయులు ఆసక్తి చూపడం లేదు. ఇటీవల రూరల్ ప్రాంతం నుంచి విద్యాశాఖ అధికారి కొందరు ఉర్దూమీడియం టీచర్లను నిజామాబాద్ నగరానికి డిప్యుటేషన్ వేశారు. కానీ వారు సంబంధిత పాఠశాలలకు వెళ్లడానికి ఇష్టపడడం లేదు. పైరవీలు చేసి అదే చోట ఉంటున్నారు. మరో ప్రాంతానికి వెళ్తే భారం పడుతుందని భావిస్తున్నారు. ఇలా ఇప్పటి వరకు 38 మంది ఉపాధ్యాయులు డిప్యుటేషన్ నిలిపి వేయించుకున్నారు.

ఖాళీల కొరత తీర్చాం..



జిల్లాలోని ఉర్దూ మీడి యం పాఠశాలల్లో ఖాళీల కొరత తీర్చాం. ముఖ్యంగా పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాం. ఈసారి ఇక్కడ కూడా మంచి ఫలితాలు సాధిస్తాం. వందశాతం ఉత్తీర్ణత కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. కానీ కొన్ని చోట్ల ప్రత్యేక తరగతులు జరగడం లేదని తెలిసింది. వారిపై చర్యలు తీసుకుంటాం. – దుర్గాప్రసాద్, డీఈవో

ప్రత్యేక దృష్టి పెట్టాలి



ఉర్దూ మీడియం పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలి. మంచి ఫలితాల కోసం అధికారులు కృషి చేయాలి. ఖాళీలు ఉన్న ఉన్న చోట విద్యా వలంటీర్లను నియమించాలి. లేదంటే బోధన కుంటుపడుతుంది.
– ఖాజామొయినొద్దీన్, మైనార్టీ రైట్స్ ప్రొటెక్షన్ ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు

బోర్గాంలో ఉద్రిక్తత



పోలీస్ వాహనాన్ని అడ్డుకుంటున్న గ్రామస్తులు

రెంజల్: మండలంలోని బోర్గాం గ్రామంలో బుధవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఉగాది సందర్భంగా గ్రామ శివారులో వీడీసీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. చివరి కుస్తీకి నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తుండగా రెంజల్‌కు చెందిన ఓ యువకుడు నిర్వాహకుడి చొక్కా పట్టుకుని నెట్టివేశాడు. దీంతో గ్రామస్తులు అతన్ని పట్టుకుని చితకబాదారు. గ్రామ శివారు నుంచి తరిమారు. చివరకు పోలీసులు యువకుడిని వాహనంలో ఎక్కించగా గ్రామస్తులు అడ్డుకున్నారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తు వాహనం ముందు బైఠాయించారు. చివరకు గ్రామపెద్దలు నచ్చచెప్పడంతో శాంతించారు. పోలీసులు గొడవకు కారణమైన యువకుడిని స్టేషన్‌కు తీసుకరాగా బోర్గాం గ్రామస్తులు యువకునిపై ఫిర్యాదు చేసేందుకు తరలివచ్చారు.

క్లుప్తంగా

సాఫ్ట్‌బాల్‌ పోటీల్లో ప్రతిభ



ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని గురుకుల బాలుర పాఠశాల క్రీడామైదానంలో ఈనెల 19న గుజరాతి గంగారాం స్మారకర్థం జిల్లాస్థాయి అండర్‌–12 సాఫ్ట్‌బాల్‌ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఆర్మూర్‌ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి, ప్రథమ స్థానంలో గెలుపొందినట్లు పాఠశాల ప్రిన్సిపాల్‌ దుర్గారెడ్డి బుధవారం తెలిపారు. ఈసందర్భంగా గెలుపొందిన విద్యార్థులను వైస్‌ ప్రిన్సిపాల్‌ సంధ్యారాణి, శ్రీధర్‌, లక్ష్మణ్‌, మురళీ, జైపాల్‌, రాములు, వ్యాయామ ఉపాధ్యాయులు రాజేందర్‌. అర్జున్‌, ఉపాధ్యాయులు అభినందించారు.

రుద్రూర్‌ ఉపాధ్యాయుడికి ప్రశంసాపత్రం



రుద్రూర్‌: ఖగోళంలోని వివిధ అంశాలను పరిశోధించినందుకు రుద్రూర్‌ మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడికి ప్రశంసా పత్రం లభించింది. ఎం ప్రసూన్‌ కుమార్‌ నాసా భాగస్వామ్యంతో యూనివర్సిటీ ఆఫ్‌ హవాయి నుంచి ఈ ప్రశంసా పత్రం అందుకున్నారు. ప్రసూన్‌ కుమార్‌ ప్రస్తుతం కామారెడ్డి జిల్లా డోంగ్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. స్టేట్‌ రిసోర్స్‌ పర్సన్‌గా కూడా రాణిస్తున్నారు.

టీటీడీ ఆధ్వర్యంలో ఉత్సవాలు

కామారెడ్డి అర్బన్‌: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్‌ ఆధ్వర్యంలో గురువారం నుంచి 29వ తేదీ వరకు ఎన్జీవోస్‌ కాలనీలోని శ్రీలలితా త్రిపుర సుందరి సహిత శ్రీసీతారామచంద్ర ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో రామాయణంపై ప్రవచన సప్తాహం నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా సమన్వయకర్త సీతారామ చంద్రమూర్తి తెలిపారు. భక్తులు హాజరు కావాలని కోరారు. ఇదిలా ఉండగా సీతారామ చంద్ర ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో 30న ఉదయం 11–55 గంటలకు శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

పోస్టర్ల ఆవిష్కరణ



నిజామాబాద్‌నాగారం: నగరంలోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో బుధవారం విద్యుత్‌ శాఖ ఉద్యోగుల జేఏసీ నాయకులు 'చలో విద్యుత్‌ సౌధా' పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా జిల్లా జేఏసీ చైర్మన్‌ రఘునాథన్‌ మాట్లాడుతూ.. రాష్ట్ర టీఎస్‌ పీజేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో విద్యుత్‌ సౌదా వద్ద విద్యుత్‌ ఉద్యోగుల మహా బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి, ఉద్యోగులకు పీఆర్సీ, ఈపీఎఫ్‌ టు జీపీఎఫ్‌ను ప్రకటించాలని కోరారు. జేఏసీ కన్వీనర్‌ బాలేష్‌ కుమార్‌, కో చైర్మన్‌ గంగాధర్‌, కన్వీనర్లు తోట రాజశేఖర్‌, కాశీనాథ్‌ తదితరులు ఉన్నారు.

రైతుల పాలిట వరం కేవీకే

- వాతావరణ సూచనలివ్వడంలో కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) పనితీరు బేష్‌
- నేడు అంతర్జాతీయ వాతావరణ దినోత్సవం



రైతుల అభిప్రాయాలను సేకరిస్తున్న వాతావరణ పర్యవేక్షకుడు సంజయ్‌

రుద్రూర్‌: వాతవరణంలో ఇటీవల చాల మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అకాల వర్షాలు, ఉరుములు, మెరుపులు, పిడుగులు, ఈదురు గాలలు, తుఫానులు, వేడి గాలులు.. ఇలాంటి వాతావరణ సమస్యలను అధిగమించి, రైతులు వ్యవసాయం చేయడానికి 'కృషి విజ్ఞాన కేంద్రం' వరంలా మారింది. ఎప్పటికప్పుడు కేవీకేలోని వాతవరణ విభాగం రైతులకు వాతావరణ సూచనలు, ముందస్తుగా వాతావరణ సమాచారాన్ని అందిస్తూ ఎంతో సహాయకారిగా ఉంటోంది. నేడు అంతర్జాతీయ వాతావరణ దినోత్సవం సందర్భంగా రుద్రూర్‌ 'కేవీకే'పై ప్రత్యేక కథనం..

భారత వాతావరణ విభాగం, భారత వ్యవసాయ పరిశోధన మండలి, ప్రొఫెసర్‌ జయంకర్‌ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం సంయుక్తంగా జిల్లా స్థాయి వ్యవసాయ వాతావరణ విభాగం (డీఏఎంయూ)ను రుద్రూర్‌ కృషి విజ్ఞాన కేంద్రంలో 2020లో ఏర్పాటు చేశారు. ఈ విభాగంలో శాస్త్రవేత్త శ్రీలక్ష్మీ, వాతావరణ పర్యవేక్షకుడు సంజయ్‌ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దేశ వ్యాప్తంగా 766 జిల్లాల్లో 4వందలకు పైగా కేవీకేలు ఉండగా తెలంగాణ రాష్ట్రంలోని 8కేవీకేల్లో డీఏఎంయూలను నెలకొల్పారు. వాటిలో జిల్లాలోని రుద్రూర్‌ కృషి విజ్ఞాన కేంద్రం ఒకటి.

రైతుల ఫోన్లకు సమాచారం..

రుద్రూర్‌ కేంద్రం కోఆర్డినేటర్‌ ఆధ్వర్యంలో ఇక్కడి శాస్త్రవేత్తలు ప్రతి మంగళ, శుక్రవారాల్లో రాబోయే 5రోజుల ముందస్తు వాతవరణ సమాచారాన్ని అంచనా వేసి తదనుగుణంగా వ్యవసాయ సలహాలు, సూచనలతో కూడిన బులెటిన్‌ను రైతుల సెల్‌ఫోన్‌లకు వాట్సాప్‌ ద్వారా అందిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల రైతులు, వ్యవసాయాధికారులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారుల సెల్‌ నంబర్లతో 103 వాట్సాప్‌ గ్రూపులు ఏర్పాటు చేశారు. ఈ గ్రూపుల్లో 12వేల మంది రైతులు ఉన్నారు. జిల్లాలో నిర్వహించే వాట్సాప్‌ గ్రూపు ద్వారా ప్రతి రోజు 20 మంది వరకు రైతుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు.

సస్యరక్షణ చర్యలు కూడా..

వాతావరణ విభాగం శాస్త్రవేత్తలు కేవలం వాతావరణ సమాచారానికే పరిమితం కాకుండా వాట్సాప్‌ ద్వారా రైతులకు అవసరమగు సస్యరక్షణ చర్యలు తెలియజేస్తున్నారు. అలాగే వాతావరణ బులెటిన్‌తో పాటు రైతులు పంపే సమస్యల ఫొటోలు పరిశీలించి, పరిష్కార మార్గాన్ని తెలియజేస్తున్నారు.



క్షేత్ర సందర్శనలో కృషి విజ్ఞాన కేంద్రం బృంద సభ్యులు

ప్రతి మూడు గంటల్లో సంభవించే వాతవరణ హెచ్చరికలు, దానికి అనుగుణంగా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నారు. డీఏఎంయూ సేవ ద్వారా రైతులు నేరుగా తమ సమస్యను శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారాన్ని తెలుసుకుంటున్నారు. తెగుళ్ల ఉధృతిని బట్టి శాస్త్రవేత్తలు, స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుని క్షేత్ర సందర్శనకు వెళుతున్నారు.

కేవీకే శాస్త్రవేత్తల స్పందన బాగుంది..



గతంలో పంటల సాగులో సమస్య వస్తే వ్యవసాయాధికారుల సలహాల కోసం ఎదురుచూసే వాళ్లం. ముఖ్యంగా వాతావరణ సమాచారం, పురుగు మందుల పిచికారీపై తలెత్తే సందేహాల నివృత్తికి ఇబ్బంది పడేవాళ్లం. ప్రస్తుతం కేవీకే వాతావరణ విభాగం శాస్త్రవేత్తల స్పందన బాగుంది. సోషల్‌ మీడియా ద్వారా వాతవరణ సూచనలే కాకుండా మేలైన యాజమాన్య, సస్యరక్షణ పద్ధతులు తెలుసుకుంటున్నాం. –గంగాధర్‌ పటేల్‌, రైతు, ఖండ్‌గాం

వృథా ఖర్చులను తగ్గించుకుంటున్నాం..



వాతావరణ మార్పుల వల్ల పంటల్లో చీడపీడల ఉధృతి తెలియక, గతంలో అధిక మోతాదులో రసాయన మందులు వాడేవాళ్లం. ఇప్పుడు సరైన వాతావరణ సమాచారంతో కూడిన వ్యవసాయ సూచనలు పాటిస్తూ వృథా ఖర్చులను తగ్గించుకుంటున్నాం.

–బెలకొని రవి, బరంగేడ్గి, బీర్కూర్‌ మండలం

మేఘదూత్‌ యాప్‌తో సమాచారం..



స్మార్ట్‌ ఫోన్‌ వాడుతున్న రైతులు, గూగుల్‌ ప్లేస్టోర్లో మేఘదూత్‌ యాప్‌ డౌన్‌లోడ్‌ చేసుకుంటే ఐదు రోజుల ముందస్తు వాతావరణ సమాచారం, జాగ్రత్తలతో కూడిన వ్యవసాయ సలహాలు పొందవచ్చు. ప్రస్తుత పరిస్థితుల్లో వాతావరణానుగుణంగా వ్యవసాయం చేయాల్సిన అవసరం ఉంది. అందువల్ల ముందస్తు వాతావరణ సమాచారం పొందడానికి రుద్రూర్‌ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలను సంప్రదించాలి.

–శ్రీలక్ష్మి, శాస్త్రవేత్త, రుద్రూర్‌ కేవీకే వాతావరణ విభాగం

కవులు సమాజ నిర్దేశకులు





నగరంలో కవులను సన్మానిస్తున్న మేయర్‌, తదితరులు.. మోర్తాడ్‌లో కవితను వినిపిస్తున్న రచయిత్రి

నిజామాబాద్‌ సిటీ: సామాజిక బాధ్యతతో కవిత్వం రాస్తూ మనుషులలో మంచి మార్పును తీసుకువస్తున్న కవులు సమాజ నిర్దేశకులని మేయర్‌ దండు నీతూకిరణ్‌ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో బుధవారం ఉగాది సందర్భంగా ఇందూరు యజ్ఞసమితి, సంస్కారభారతి, ఇందూరు యువత సంస్థల ఆధ్వర్యంలో పంచాంగ పఠనం, కవి సమ్మేళనం నిర్వహించారు. కవులు మల్లవరపు చిన్నయ్య, డాక్టర్‌ శారదాహన్మాండ్లు, డాక్టర్‌ మద్దుకూరి సాయిబాబు, బుద్దె హన్మాండ్లుకు అతిథుల చేతుల మీదుగా సాహిత్యపురస్కారాలను మూడ నాగభూషణంగుప్తా అందించారు. డాక్టర్‌ మధుసూదన శర్మ పంచాంగపఠనం, విశేష కవిసమ్మేళనం, దారం గంగాధర్‌ రాసిన 'మబ్బులచాటు చంద్రుడు', ట్రాఫిక్‌ ఏఎస్సై తొగర్ల సురేశ్‌ రాసిన 'మట్టికుండ' అనే పుస్తకాలను ఆవిష్కరించారు. మేయర్‌ మాట్లాడుతూ.. తెలంగాణ భాష, సంస్కృతులను తరతరాలకు వారసత్వంగా అందిస్తున్న కవిలోకానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కవులు వీపీ చందన్‌ రావు, త్రివేణి, మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్‌లో కవి సమ్మేళనం

మోర్తాడ్‌: మోర్తాడ్‌లో శ్రీశుభకృత్‌ నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం కవి సమ్మేళనం నిర్వహించారు. పద్మశాలి సంఘం కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ సమ్మేళనంలో సాహిత్యాభిమానులు, కవులు, రచయి తలు తమ కవితలను చదివి వినిపించారు. ఉత్తమ కవితలను చదివి వినిపించినవారికి నిర్వాహకులు బహుమతులను పంపిణీ చేశారు.

రసవత్తరంగా కుస్తీపోటీలు

బాన్సువాద రూరల్‌/రుద్రూర్‌/వర్ని: కామారెడ్డి, నిజామాబాద్‌ జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం ఉగాది పండుగ సందర్భంగా నిర్వహించిన కుస్తీపోటీలు రసవత్తరంగా కొనసాగాయి. బాన్సువాడ మండలంలోని ఇబ్రాహింపేట్‌, కోనాపూర్‌ గ్రామాల్లో నిర్వహించిన కుస్తీపోటీల్లో మల్లయోధులు హోరాహోరీగా తలపడ్డారు. అనంతరం విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు. అలాగే కోటగిరి మండల కేంద్రంలో, వర్ని మండలం తగిలేపల్లి గ్రామంలో వీడీసీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. రెంజల్‌ మండలంలోని కల్యాపూర్‌, బోర్గాం గ్రామాల్లో జరిగిన కుస్తీపోటీల్లో చుట్టుపక్కల గ్రామాలతో, మహారాష్ట్ర నుంచి మల్లయోధులు తరలివచ్చారు. ప్రతిభ చూపిన మల్లయోధులకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఆయా గ్రామాల్లోని పోటీలను తిలకించడానికి సమీప గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు.



ఇబ్రాహింపేట్‌లో కుస్తీ పడుతున్న మల్లయోధులు



కోటగిరి మండల కేంద్రంలో..



తగిలేపల్లి గ్రామంలో..



కల్యాపూర్‌ గ్రామంలో..

హిందూ సమాజాన్ని సంఘటితం చేయాలి

- ఆర్‌ఎస్‌ఎస్‌ ప్రధానవక్త ప్రభుకుమార్‌
- నగరంలో ఇందూరు ఉగాది ఉత్సవం





నగరంలో మాట్లాడుతున్న ప్రధాన వక్త ప్రభుకుమార్‌.. నవీపేట్‌లో మాట్లాడుతున్న నరేష్‌

నిజామాబాద్‌ సిటీ: శోభకృత్‌ నామ సంవత్సరంలో హిందూ సమాజాన్ని మరింత సంఘటితం చేసేందుకు ప్రతిఒక్కరూ సంఘంతో కలిసి కృషి చేయాలని ఆర్‌ఎస్‌ఎస్‌ సహ ప్రాంత ప్రచారక్‌ తెలంగాణ ప్రధానవక్త ప్రభుకుమార్‌ పిలుపునిచ్చారు. నగరంలోని బస్వాగార్డెన్‌లో బుధవారం ఆర్‌ఎస్‌ఎస్‌ ఇందూర్‌ ఉగాది మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుకుమార్‌ మాట్లాడుతూ.. కాలగమనంలో ఎన్నో మార్పులు సంభవిస్తుంటాయని, అనేక రకాల కష్టాలను ఎదుర్కొని సమాజానికి మంచి అందించడానికి ఉగాదులు వస్తుంటాయని అలా ఉగాదినాడే ఆర్‌ఎస్‌ఎస్‌ మొదటి సారసంఘచాలక్‌ డాక్టర్‌ హెడిగేవార్‌ జన్మించారని అన్నారు. వారి కారణంగానే ఆర్‌ఎస్‌ఎస్‌ 1925లో ప్రారంభమైందని, ఇది దేశం సర్వాంగీన ఉన్నతి కోసం కృషి చేస్తుందని పేర్కొన్నారు. భారతదేశం మళ్లీ పూర్వ వైభవ స్థితికి పోవాలని ఆర్‌ఎస్‌ఎస్‌ ఆకాంక్షిస్తుందన్నారు. దీనికోసం ఆర్‌ఎస్‌ఎస్‌ ఎన్నెన్నో కష్టాలను నిషేధాలను సైతం ఎదుర్కొందన్నారు. ఆయన మొక్కవోని దీక్షతో హిందూ సమాజాన్ని సంఘటితం చేస్తూ సంఘం ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమ ముఖ్యఅతిథి ఉత్తమరైతు, విశ్వ అగ్రిటెక్‌ వ్యవస్థపకుడు, సీఈవో బైర సుభాష్‌ మాట్లాడుతూ.. దేశభక్తి, సామాజిక స్పృహ కల్గిన సంస్థ ఆర్‌ఎస్‌ఎస్‌ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌ తన జీవిత గమనాన్ని మార్చిందన్నారు. అనంతరం చిన్నారుల భరతనాట్యం, అన్నమాచార్య సంకీర్తనం శ్రోతలను అలరించగా ఉగాది పంచాంగ శ్రవణంతో ఉగాది మహోత్సవం మొదలయ్యింది. జిల్లా సంఘ జాలక్‌ కాపర్తి గురుచరణం, నగర సంఘచాలక్‌ తిరుక్కోవల్లూరు శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

భారత దేశ సంస్కృతి విశిష్టమైనది

నవీపేట: భారత దేశ సంస్కృతి విశిష్టమైనదని ఆర్‌ఎస్‌ఎస్‌ విభాగ్‌ ప్రచారక్‌ నరేష్‌ పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన ఆర్‌ఎస్‌ఎస్‌ వ్యవస్థాపక దినోత్సవాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచ దేశాలు కొనియాడుతున్న భారతదేశ సనాతన ధర్మాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కొందరు కుట్రలు చేస్తున్నారని, వారికి గుణపాఠం చెప్పాలని సూచించారు. ఆర్‌ఎస్‌ఎస్‌ వ్యవస్థాపకులు హెడ్గేవార్‌ను ఆదర్శంగా తీసుకుని హిందూ ధర్మ రక్షణకు ప్రతి ఒక్కరు సైనికుడిలా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సురేష్‌, ఆర్‌ఎస్‌ఎస్‌ ప్రతినిధులు సందీప్‌, శ్రీకాంత్‌, వసంత్‌ పాల్గొన్నారు.

విప్‌ను కలిసిన క్రెడా ప్రతినిధులు

కామారెడ్డి అర్బన్‌: కామారెడ్డి రియల్‌ ఎస్టేట్‌ డెవలపర్స్‌ అండ్‌ ఏజెంట్స్‌ అసోసియేషన్‌ (క్రెడా) నూతన కార్యవర్గ సభ్యులు బుధవారం ప్రభుత్వ విప్‌ గంప గోవర్ధన్‌ను కలిశారు. 26న చేపట్టనున్న ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు కావాలని ఈ సందర్భంగా వారు కోరారు. అనంతరం క్రెడా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారిగా ఎన్నికైన పిట్లరాము, కల్లెం సత్యం, భీంరాజులు పూర్తి కార్యవర్గాన్ని ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా ఎం.దేవసేనపటేల్‌, కోటేశ్వర్‌, సంయుక్త కార్యదర్శులుగా లస్కర్‌ నాయక్‌, మల్లేష్‌ యాదవ్‌, ముఖ్య సలహాదారులుగా లక్ష్మిరాజం, శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రెడ్డి, పంతులు శ్రీనివాస్‌, ప్రేంనాయక్‌, సలహాదారులుగా పిట్ల శ్రీనివాస్‌, టంకరి రవి, రమేష్‌గౌడ్‌, డైరెక్టర్లుగా సున్నం శ్రీనివాస్‌, సంతోష్‌గౌడ్‌, భూమయ్య, పీఆర్‌ఓగా గోపికృష్ణ, ఆడిటర్‌గా రాజలింగంను ఎన్నుకున్నారు.



విప్‌ గంప గోవర్ధన్‌తో క్రెడా ప్రతినిధులు

బాన్సువాడలో మహా గర్జన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న డీసీసీబీ చైర్మన్‌ పోచారం భాస్కర్‌రెడ్డి

బాన్సువాడ టౌన్‌: పట్టణంలో బుధవారం ఉగాది పండుగ సందర్భంగా జగద్గురు నరేంద్రచార్య మహారాజ్‌ ఆశీస్సులతో మహాగర్జన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా జగద్గురు నరేంద్రచార్య పాదుకలతో అయ్యప్ప ఆలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ అంబేద్కర్‌ చౌరస్తా, రాజీవ్‌చౌరస్తా, తాడ్కోల్‌ చౌరస్తా, పాత అంగడి బజారు వరకు కొనసాగింది. డీసీసీబీ చైర్మన్‌ పోచారం భాస్కర్‌రెడ్డి ర్యాలీలో పాల్గొని, భక్తులతో పాటు కీర్తనలు ఆలపించారు. ఆలయకమిటీ సభ్యులు గురువినయ్‌, కొత్తకొండ భాస్కర్‌, విఠల్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ నాయకులు శ్రీధర్‌, పాత బాలకృష్ణ, అంజిరెడ్డి, ఎజాస్‌, మోహన్‌నాయక్‌, గంగాధర్‌, కిరణ్‌, శ్రీనివాస్‌, లింగం, వీరారెడ్డి, హిందువులు పాల్గొన్నారు.



జగద్గురు నరేంద్ర చార్య పాదుకల రథం

క్రైం కార్నర్‌

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య



సాధక్‌ (ఫైల్‌)

ఎడపల్లి(బోధన్‌): మండలంలోని ఎంఎస్‌సీ ఫారంలో ఓ వ్యక్తి కుటుంబ కలహాల కారణంగా రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే ఎస్సై ప్రణయ్‌, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన సాధక్‌(45) కూలీ పని చేస్తూ జీవించేవాడు. కొన్ని నెలలుగా కుటుంబంలో గొడవలు జరగడంతో మనస్థాపం చెందాడు. ఈక్రమంలో బుధవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైలు కిందపడిపోవడంతో మృతదేహం రెండు ముక్కలైంది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని, శవాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆర్థిక ఇబ్బందులతో లైన్‌మన్‌..



శేఖర్‌ (ఫైల్‌)

కామారెడ్డి క్రైమ్‌: మాచారెడ్డి మండలం సోమరంపేట లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న బల్ల శేఖర్‌(40) ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. దోమకొండకు చెందిన శేఖర్‌ కామారెడ్డిలో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఇటీవల నూతన గృహాన్ని కొనుగోలు చేశాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులు పెరగడంతో మనస్థాపం చెందినట్లు తెలిసింది. ఈక్రమంలో బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో అతడు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు విచారణ జరుపుతున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

నిందితుల రిమాండ్‌

నవీపేట: మండలంలోని కమలాపూర్‌లో ఇటీవల దారిదోపిడికి పాల్పడిన ముగ్గురు నిందితులను రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై రాజారెడ్డి బుధవారం తెలిపారు. వివరాలు ఇలా.. మండలంలోని కమలాపూర్‌ గ్రామానికి చెందిన పాలెం నరేష్‌, మహారాష్ట్రలోని నాగ్‌ పూర్‌లో హార్వెస్టర్‌ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 20న అర్ధరాత్రి నవీపేటకు చేరుకున్న పాలెం నరేష్‌పై ముగ్గురు యువకులు దాడి చేసి, సెల్‌ఫోన్‌, పర్సును లాక్కున్నారు. బాధితుడు పోలీసులను ఆశ్రయించగా విచారణ చేపట్టి, నిందితులు షేక్‌ సలీం, ఇర్ఫాన్‌, అజయ్‌లను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి ఫోన్‌, పర్సును స్వాధీనం చేసుకొని, రిమాండ్‌కు తరలించారు.

'పేపర్‌ లీకేజీ' నిందితులను అరెస్టు చేయాలి



నిజామాబాద్‌నాగారం: టీఎస్‌పీఎస్సీ పేపర్‌ లీకేజీలో నిందితులను వెంటనే అరెస్టు చేయాలని సామాజిక రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రేమ్‌లాల్‌ డిమాండ్‌ చేశారు. నగరంలోని వినాయక్‌నగర్‌లోగల సంఘ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. చాలామంది నిరుద్యోగులు అప్పులు చేసి కోచింగ్‌ కేంద్రాల్లో చేరారని, ఈ పేపర్‌ లీకేజీ వల్ల విద్యార్థుల భవిష్యత్‌ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ప్రభుత్వం స్పందించి నిందితులను వెంటనే అరెస్టు చేయించాలని కోరారు. సంఘం సభ్యులు మురళీధర్‌, రమేష్‌ తదితరులున్నారు.

రాష్ట్ర మైనారిటీ కమిషన్‌ చైర్మన్‌కు అభినందనలు



నిజామాబాద్‌ నాగారం: తెలంగాణ రాష్ట్ర మైనారిటీ కమిషన్‌ చైర్మన్‌ తారిక్‌ అన్సారీని శాసన మండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా అన్సారీ మాట్లాడుతూ.. ఢిల్లీ లిక్కర్‌ స్కాం తప్పుడు కేసన్నారు. ఎమ్మెల్సీ కవిత కోసం ప్రత్యేకంగా ప్రార్థనలు చేసినట్లు తెలిపారు.

ఆర్టీసీ ద్వారా రాములోరి తలంబ్రాలు



సిరికొండ: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి కల్యాణ తలంబ్రాలను టీఎస్‌ ఆర్టీసీ ద్వారా భక్తులకు అందిస్తున్నట్లు ఆర్టీసీ సిబ్బంది గంగాధర్‌, మురళీ తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం తలంబ్రాల బుకింగ్‌ క్యాంపెయిన్‌ నిర్వహించారు. రూ. 116 చెల్లిస్తే రాములోరి కల్యాణ తలంబ్రాలను బుక్‌ చేసుకున్న భక్తుల ఇంటికే తెచ్చి అందిస్తామని తెలిపారు. సర్పంచ్‌ యెన్నం రాజారెడ్డి, వీడీసీ చైర్మన్‌ భాస్కర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, సతీష్‌, రాజగణేష్‌గౌడ్‌, నాగేష్‌, ప్రశాంత్‌ పాల్గొన్నారు.

పేకాడుతున్న వారి అరెస్ట్‌

మద్నూర్‌(జుక్కల్‌): డోంగ్లీ మండలంలోని మదన్‌హిప్పర్గా గ్రామంలో బుధవారం పేకాట ఆడుతున్న వారిని పట్టుకొని అరెస్ట్‌ చేసినట్లు ఎస్సై కృష్ణ రెడ్డి తెలిపారు. గ్రామంలో నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా, వారిని పట్టుకొని, వారి వద్ద నుంచి రూ.3,150 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలో ఎవరైన పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.